క్లుప్తంగా

న్యూ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి



జేసీ ఇలక్కియకు వినతిపత్రం అందజేస్తున్న ఐలు ప్రతినిధులు

కాకినాడ సిటీ: న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియకు వినతిపత్రం సమర్పించారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు నవంబర్ 29, 30, ఈనెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు చేపట్టారని ఐలు ప్రతినిధులు మేడపాటి ధర్మారెడ్డి, గుదిమెళ్ల భాస్కరాచార్యులు, కె.నాగజ్యోతి వివరించారు. న్యాయవాదులు ఈ నెల 15 వరకు విధులు బహిష్కరించి నిరసనలు నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే తెలియజేసినట్లు పేర్కొన్నారు. జేసీని కలిసిన వారిలో ఆర్వి రమణారావు, జివి దేశి, కె దుర్గాభవాని, రాజ్యలక్ష్మి, మురళి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఎన్టీఆర్ నగర్‌లో వృద్ధులకు వైద్యురాలు వరలక్ష్మి సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఉష, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో రమాసుందరి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కళాశాల ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్, ప్రింటర్‌లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి ప్రభుత్వ బాలికల కళాశాలకు సోమవారం పూర్వ విద్యార్థులు కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. కళాశాలలో కంప్యూటర్ లేక ఇబ్బందికరంగా ఉంటోందని ఉపాధ్యాయులు తెలపడంతో 1988–89 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు గంధం సతీష్, మిరియాల నరసింహారావు, మంచాల శ్రీనివాస్, ఉప్పలపాటి రామమోహన్‌రావు, గొర్రెల కామేశ్వరరావు, సీహెచ్ భైరవమూర్తి, పి.గోవిందరావు, పి.అప్పారావు తదితరులు స్పందించి కంప్యూటర్, ప్రింటర్‌లను ప్రిన్సిపాల్ యు.లీలామనోహర్‌కు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

కరప: పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష సంయుక్త కార్యాచరణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడలో సోమవారం నిర్వహించిన ధర్నాకు సంఘీభావంగా మండలంలోని ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు సామూహిక శెలవు పెట్టి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా బిషప్ రత్నబాబు



పాస్టర్స్ ఫెలోషిప్ ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: జగన్నాథపురం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా బిషప్ పి.రత్నబాబు ఎన్నికయ్యారు. స్థానిక చర్చి ఆఫ్ క్రైస్ట్‌లో నిర్వహించిన పాస్టర్స్ ఫెలోషిప్ ఎన్నిక పి.వి జయకుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. నూతనంగా ఎన్నికైన జగన్నాథపురం పాస్టర్స్ అండ్ ఇవాంజిలిస్ట్ ఫెలోషిప్ కార్యవర్గ పత్రాలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా కార్యవర్గానికి అందజేశారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ బాలుడు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ రూరల్ మండలం చీడిగకు చెందిన రామంతి లహరీష్ (16) ఎలక్ట్రికల్ పనులు నేర్చుకుంటున్నాడు. ఆదివారం తన సైకిల్‌పై మాధవపట్నంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా ప్రతాప్ నగర్ సమీపంలో ఓ లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి మర్మాంగంపై తీవ్ర గాయామైంది. కుటుంబసభ్యులు జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్యం కోరల్లో తుల్యభాగ

- కాలువలోకి దిగుతుంటే దురదలు
- చర్యలు తీసుకోవాలని రైతుల వినతి



వేములవాడ వద్ద కలుషితమైన తుల్యభాగ డ్రెయిన్



పెదకొత్తూరు వద్ద కలుషితమైన తుల్యభాగ డ్రెయిన్



పేపర్‌మిల్లు, రొయ్యల చెరువుల వల్ల కలుషితమై నల్లగా మారిన తుల్యభాగ డ్రెయిన్‌లోని నీరు

కరప: జిల్లాలోని పవిత్ర నదులలో తుల్యభాగ ఒకటి. నేడు అది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. పేపర్ మిల్లుల నుంచి, రొయ్యల చెరువుల నుంచి వదిలే వ్యర్థాలతో నీరు కలుషితమవుతోంది. పశువులు కూడా తాగలేనంతగా నీరు కలుషితమైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కడియం మండలం నుంచి ఆరు మండలాల్లో ప్రవహించే తుల్యభాగ డ్రెయిన్ కరప మండలం మీదుగా తాళ్లరేవు మండలం పటవల వద్ద సముద్రంలో కలుస్తుంది. వరిసాగుకు పంట కాలువలు ఎంత ముఖ్యమో మురుగు కాలువలు కూడా అంతే ప్రధానమైనవి. పంట కాలువల ద్వారా సాగునీరు పొలాల్లోకి వస్తే, పంట పొలాల్లోని మురుగునీరు, ముంపునీరు ఈ డ్రైన్ల ద్వారా దిగుతుంది. ఆరు మండలాల్లోని పంటపొలాల్లోని మురుగునీరు, వర్షాకాలంలో వచ్చే ముంపునీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. రబీ సీజన్‌లో సాగు నీరు అందక పోతే డ్రెయిన్లలో అడ్డుకట్ట వేసి, ఆయిల్ ఇంజన్ల ద్వారా పొలాల్లోకి తోడుకునేవారు. గోదావరిలో నీటి లభ్యత తగ్గినప్పుడు నీటి ఎద్దడిని అధిగమించేందుకు పంట కాలువలతో పాటుగా, మురుగు కాలువలపై రైతులు ఆధారపడుతుంటారు. ఇప్పుడా పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. తుల్యభాగ డ్రెయిన్ ప్రవహించే కరప మండల పరిధిలో వేళంగి, పెదకొత్తూరు, వేములవాడ, కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాల వారు పశువులకు నీరు పెట్టుకోవడం, వాటిని శుభ్రం చేసేందుకు వినియోగించేవారు. గోదావరి పుష్కరాల సమయంలో కూడా పుణ్యస్నానాలు ఇందులోనే చేసేవారు. అటువంటి తుల్యభాగ డ్రెయిన్‌లో నీరు కడియం పేపర్‌మిల్లు, ఆరు మండలాల పరిధిలో ఈ డ్రెయిన్ వెంబడి తవ్విన రొయ్యల చెరువుల వల్ల కలుషితమై నీరు నల్లగా మారిపోయింది. పేపర్‌మిల్లు నుంచి వదిలే వ్యర్థాలు, రసాయనాల వల్ల, రొయ్యల చెరువుల్లో వినియోగించే యాంటీ బయోటిక్ మందులతో కూడిన నీటిని తుల్యభాగ డ్రెయిన్‌లో వదలడం వల్ల పూర్తిగా కలుషితమైపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులు అయిన తర్వాత ఇంటికి వెళ్లే ముందు తుల్యభాగలో స్నానాలు చేసి వెళ్లేవారమని, ఇప్పుడు ఈ కాలువలోకి దిగుతుంటే దురదలు వచ్చి, శరీరమంతా దద్దుర్లు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పశువులను తుల్యభాగ డ్రెయిన్‌లోకి దింపి కడిగిన, నీరుతాగిన పశువులకు వ్యాధులు సోకుతున్నట్లు పాడిరైతులు అంటున్నారు. రబీ చేలకు కూడా పనిచేయకుండా నీరంతా నల్లగా మారిపోయి ఉంటుందని వేములవాడ, పెదకొత్తూరు, వేళంగి గ్రామ రైతులు తెలిపారు. తుల్యభాగ డ్రెయిన్ రోజు రోజుకు కలుషితమైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారులకు ఇప్పటికే వివరించాం

రొయ్యల చెరువులు, పేపర్ మిల్లులు వదిలే వ్యర్థాల ద్వారా తుల్యభాగడ్రెయిన్‌లో నీరు కలుషితమవుతోంది. ఈ విషయమై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు రెండు, మూడు సార్లు చెప్పాము. ఉన్నతాధికారుల సమావేశంలో కూడా నివేదించాం. వారు తీసుకునే చర్యల అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–కె.కీర్తి, ఏఈఈ, డ్రైన్ల శాఖ

శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి



తుల్యభాగ డ్రెయిన్ నీరు ఎంతో బాగుండేది. పూర్తిగా కలుషితమైన ఈ కాలువలోకి దిగితే దురదలు వచ్చి, శరీరం అంతా దద్దుర్లు వస్తున్నాయి. నీరు నల్లగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుల్యభాగ డ్రెయిన్ కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి.

బండే వీరబాబు, రైతు, వేములవాడ

దహన సంస్కారాల తర్వాత స్నానం చేసేవాళ్లం



మా గ్రామంలో తుల్యభాగ డ్రెయిన్ పక్కనే శ్మశాన వాటిక ఉంటుంది. దహన సంస్కారాలు చేసిన తర్వాత తుల్యభాగలో స్నానాలు చేసేవారం. ఇప్పుడా పరిస్థితి లేదు. పశువులు తాగడానికి కూడా పనిచేయనంతగా నీరు కలుషితమైపోయింది. తుల్యభాగ డ్రెయిన్ కాలుష్యాన్ని అరికట్టి, అందరికీ మేలుచేకూర్చాలి.

చింతా బుజ్జి, పెదకొత్తూరు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



వేళంగిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

- ప్రజలకు ఎంపీపీ, జెడ్పీటీసీ పిలుపు
- వేళంగిలో వై ఏపీ నీడ్స్ జగన్



వేళంగిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు కోరారు. మండలం వేళంగిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో వారు మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అనునిత్యం ప్రజలతో మమేకమై పని చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. నోడల్ అధికారి, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా అందిస్తున్న వివిధ సేవలను, సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ సవిలే నీలిమ మాట్లాడుతూ 25 డీబీటీ, 4 నాన్ డీబీటీ, 4 ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంల ద్వారా గ్రామంలో రూ.23.93 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ముందుగా సచివాలయ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తర్వాత గ్రామం కూడలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కల్సి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గరగ జెమ్మీ, జీలకర్ర దుర్గారావు, కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా ఇళ్ల పట్టాల పంపిణీ

- సూర్యారావుపేటలో పేదలకు విలువైన స్థలాలు
- పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు, సంక్షేమ పథకాల్లో భాగంగా విలువైన స్థలాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సూర్యారావుపేటలో ఇచ్చిన హామీ మేరకు 200 మంది పేదలకు సోమవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ మురార్జీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కన్నబాబు మాట్లాడుతూ ఇచ్చిన స్థలాల్లో ప్రతి ఒక్కరు ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. ఇళ్ల స్థలాలను అనుకుని భారతమాల జాతీయ రహదారి వెళ్తున్నందున భవిష్యత్‌లో ఈ స్థలాలకు చాలా డిమాండ్ ఉంటుందన్నారు. గుడిసెల తొలగింపు సమయంలో కొన్ని పార్టీల నాయకులు కావాలని రాజకీయం చేశారని, వాటన్నిటికీ పట్టాలు పంపిణీ ద్వారా సమాధానం చెప్పామన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ నాయకుడు సూరాడ రాజు, డీఎల్‌డీవో నారాయణరావు, ఎంపీడీవో స్వప్న, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు వద్దు

కాకినాడ సిటీ: విద్యుత్ భారాలు రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డికి సోమవారం అందజేశారు. సీపీఎం నాయకులు ఇచ్చిన అర్జీని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

15న అమరజీవి వర్ధంతి

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఈనెల 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు కలెక్టరేట్ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్థానిక సీబీఎం స్కూల్ ఫెలోషిప్ చర్చి సెంటర్‌లో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించనున్నట్టు పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన

కాకినాడ సిటీ: అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. సీపీఐ నాయకులు కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్ దీక్షను ప్రారంభించారు. 18న జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద మహా ధర్నా చేస్తున్నట్టు వారు తెలిపారు. బాధిత కుటుంబాలతో 30 గంటల విమోచన దీక్షలు చేస్తున్నామన్నారు.

నేడు, రేపు క్యాన్సర్ వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పూర్ణా కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్యాన్సర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత చంద్రమౌళి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పూర్ణ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచడానికి ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షిస్తున్నారని, సుమారు 800 మందికి పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు. మంగళ, బుధవారాల్లో రోగులను పరీక్షించనున్నట్టు ఆయన తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు వాగ్దానాలు

- టీడీపీ, జనసేనలపై ద్వారంపూడి ధ్వజం
- సూర్యనారాయణపురంలో వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వాగ్దానాలతో వస్తున్న టీడీపీ–జనసేనలను నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలను కోరారు. స్థానిక సూర్యనారాయణపురంలో 28, 29 డివిజన్లలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమావేశం ఏర్పాటుచేశారు. లబ్ధిదారుల ప్రదర్శన ఫలకాన్ని, పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అధికారంలో ఉన్నపుడు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు సీఎం జగన్ కన్నా మెరుగ్గా పథకాలను అమలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను సైతం పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘన చరిత్ర చంద్రబాబుదన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, స్థానిక నాయకులు వాసిరెడ్డి లోవబాబు, పినిశెట్టి సతీష్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ సత్వర పరిష్కారం

- కమిషనర్ నాగనరసింహారావు
- కార్పొరేషన్‌లో స్పందన
- టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్యలను ఎప్పటికప్పుడు నిర్దేశించిన వ్యవధిలో పరిష్కరించి ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని కమిషనర్ కోరారు. గత నవంబర్ నెలలో 40 ఫిర్యాదులు అందగా వాటిలో 27 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు.

డయల్ యువర్ కమిషనర్‌కు అంతరాయం

డయల్ యువర్ కమిషనర్‌కు సోమవారం అంతరాయం కలిగింది. సాంకేతిక పరమైన ఇబ్బంది కారణంగా ఫోన్ పని చేయకపోవడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించలేకపోయారు. ఈ సమస్యను పరిష్కరించి వచ్చే సోమవారం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కమిషనర్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు.

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలతో పాటు ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని కమిషనర్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు కాల్ చేసి సమస్యలను వివరించవచ్చునన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు వచ్చే ఫిర్యాదులకు కూడా పూర్తి ప్రాధాన్యం ఉంటుందని, ఈ నెంబర్‌కు కూడా ప్రజలు ఫోన్ చేయవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగ శాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, వివిధ విభాగాధిపతులు హాజరయ్యారు.

పంచాక్షరితో మార్మోగిన శివాలయాలు



కరప శివాలయంలో రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో త్ర్యంబకేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కరపలో వెలిగించిన కార్తిక దీపాలు

కరప: మండలంలోని శివాలయాలు శివ పంచాక్షరితో మార్మోగాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర ఆలయంలో తెల్లవారు జామున 4 గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీవారు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పెనుగుదురు, అరట్లకట్ట, వేములవాడ, పెద్దాపురప్పాడు, వేళంగి, నడకుదురు, గురజనాపల్లి, వాకాడ, కొరిపల్లి, కూరాడ, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది. ఆయా గ్రామాల్లోని అయ్యప్పస్వాములు, పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించి, స్వామివారిని దర్శించుకున్నారు.

శివాలయాలు కిటకిట

కాకినాడ రూరల్: కార్తిక మాసం ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రమణయ్యపేటలో ఆర్టీసీ కాలనీ, గోకుల్ గార్డెన్, సర్పవరం, తిమ్మాపురం, నేమాం, రేపూరు, కొవ్వూరు, ఇంద్రపాలెం తదితర గ్రామాల్లో భక్తులు శివాలయాలలో అభిషేకాలు దర్శనాలు చేసుకున్నారు. రమణయ్యపేట శేషాద్రి నగర్ బాల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి దంపతులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కనుల పండువగా దీపాల సంబరం

కరప: మండలంలోని వాకాడలో సోమవారం రాత్రి కార్తిక కోటి దీపాల సంబరం కనుల పండువగా జరిగింది. ఆకాశం నుంచి నక్షత్రాలు దిగివచ్చి నేలపై వాలినట్టుగా భక్తులకు అనుభూతి కలిగింది. కోటిదీపాలను చూసి భక్తులు తన్మయం చెందారు. పవిత్ర కార్తిక మాసం నాలుగో సోమవారం సందర్భంగా వాకాడలో పొడవైన సరుగుడు రాటలు పాతి, వెదురుబద్దలతో అరలుగా చేసి, జిగురుమట్టి ఉంచి దానిపై ప్రమిదలు పెట్టి దీపాలు వెలిగించారు. కరప, పరిసర మండలాల నుంచి భక్తులు తరలివచ్చి కోటిదీపాలను దర్శించుకున్నారు. గ్రామంలోని వీధుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి దీపాల సంబరాన్ని నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీవారు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరపలో కూడా కార్తిక దీపోత్సవం నిర్వహించారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో వారం రోజులు ముందుగా శివపార్వతులను నిలిపి, వివిధ భజన బృందాలతో సప్తాహం నిర్వహించారు. సోమవారం కార్తిక దీపాలను వెలిగించి దీపోత్సవం నిర్వహించారు. బ్యాండ్‌మేళం, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

రచయిత రాజేష్‌కు జాతీయ పురస్కారం



న్యూఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న రాజేష్

కరప: మండలం వేళంగి గ్రామానికి చెందిన రచయిత, సామాజిక వేత్త సవిలే రాజేష్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు లభించింది. రాజేష్ గత పదేళ్లుగా అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి కృషిచేస్తున్నారు. దళిత చైతన్య దీపికలు, చిన్న ప్రయత్నం, కూలీ ఉద్యమనేత సాపే అప్పలస్వామి వంటి పలు రచనలు చేశారు. దీంతో రాజేష్‌కు న్యూఢిల్లీలోని భారతీయ దళిత సాహిత్య అకాడమీ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్‌ను అందజేశారు. రాజేష్ ఫోన్ ద్వారా ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు తెలిపారు. అకాడమీ సభ్యులతో పాటు ప్రముఖ జర్నలిస్ట్, రచయిత పోనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నామాడి అప్పారావు (యానాం) పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పిఠాపురంలోని పలు వీధుల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏబీఎస్‌డీఎస్ ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రహారం, అగ్రహారం మెట్ట, కోర్టు పరిసరాలు, పశువుల సంత, హైవే పెట్రోలు బంకు సమీపం, దత్తాత్రేయ వీధి, కుమ్మరి వీధి, హార్వెస్ట్ పాఠశాల, తారకరామానగర్, వైఎస్సార్ గార్డెన్, బీఎస్ఆర్ గార్డెన్, బొజ్జావారి తోట, మాధవపురం రోడ్డు, లయన్స్ కల్యాణ మండపం, అన్నపూర్ణ సినిమా హాలు, రెడ్డి హోటల్, మాధవనగర్, సాయిదత్త నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎల్ఐసీ వీధి, రామా సినిమా సెంటర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు ముమ్మరం

పెద్దాపురం: జిల్లాలో బిక్కవోలు తరువాత మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాటు పూర్తి చేయడంలో నిమగ్నం కాగా సోమవారం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్నీ విద్యుదలంకరణతో, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. షష్ఠి రోజున వేకువ జాము నుంచి ఏలేరు నదీ స్నానాలు ఆచరించి స్వామి దర్శనం, ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.